రూ.10కే నాణ్యమైన భోజనం

- ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో రోగి సహాయకుల కోసం ఏర్పాటు
- దాతల సహకారంతో శ్రీకారం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఉష, జీవన్, డాక్టర్ జహీర్ అహ్మద్ తదితరులు

దాబాగార్డెన్స్: ప్రభుత్వ విక్టోరియా (ఘోషా) ఆసుపత్రిలో రోగి సహాయకులకు రూ.10కే నాణ్యమైన భోజనం అందించనున్నారు. స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ, వాల్తేర్ రాయల్ రౌండ్ టేబుల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉష, ఆర్‌ఎంవో జీవన్, వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జహీర్ అహ్మద్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పేషెంట్ల సహాయకులకు నాణ్యత గల, రుచికరమైన భోజనాన్ని రూ.10కే అందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ భోజనం తయారు చేయడానికి రూ.50 ఖర్చవుతుందని, వాల్తేర్ రాయల్ రౌండ్ టేబుల్ 356 సహాయ సహకారాలు అందించడంతో రూ.10కే అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వాల్తేరు రౌండ్ టేబుల్ చైర్మన్ సౌరవ్ రిషిక, విక్రాంత్, మక్సూద్ అహ్మద్, రియాజ్‌ఖాన్, రాజీవ్ అగర్వాల్, స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, గజపతిరావు, పైడిరాజు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

శాకాంబరిగా దుర్గాలమ్మ



శాకాంబరి అలంకరణలో దుర్గాలమ్మ అమ్మవారు

దాబాగార్డెన్స్: పూర్ణామార్కెట్ వెలంపేటలో కొలువుదీరిన దుర్గాలమ్మ వార్షిక జాతరలో భాగంగా సోమవారం శాకాంబరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. ప్రత్యేక అర్చనలు, విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్తలు బత్తి మంగరాజు, కండిపల్లి వరలక్ష్మి, కాంద్రేగుల రూపావతి, రమణమ్మ, దశమంతుల చిన్ని, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పుష్పాలంకరణ

వార్షిక జాతరలో భాగంగా మంగళవారం దుర్గాలమ్మను వివిధ రకాల పుష్పాలతో అలంకరించనున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. 15న సౌభాగ్యలక్ష్మి(గాజులతో)గా అలంకరించనున్నారు. ఈ నెల 16 సాయంత్రం 4 గంటలకు దీపాలంకరణ చేయనున్నారు. 17న తొలేళ్ల ఉత్సవం, 18న మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, ఆ రోజు అర్ధరాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం, తొలిపూజ వైభవంగా జరపనున్నారు. 19న అమ్మవారి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 26న మారువారం పురస్కరించుకుని అష్టోత్తర శత పదార్థ నివేదన(108 రకాల వంటకాలతో అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నట్టు ఈవో శ్రీనివాసారవు తెలిపారు.

క్లుప్తంగా

'బడ్జెట్ గిఫ్ట్ మాకొద్దు'

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 2023–24 ఏడాదికి సంబంధించి ఇస్తున్న రూ.15వేలు విలువైన గిఫ్ట్ కూపన్ మాకొద్దంటూ సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు మేయర్ గొలగాని హరివెంకట కుమారికి లేఖ రాశారు. గిఫ్ట్ కూపన్‌ను తిరస్కరిస్తున్నట్టు ఓ ప్రకటనలో తెలిపారు. గిఫ్ట్‌ల సంస్కృతి విడనాడాలని ఆయన కోరారు.

ఈ-చలానా రద్దుకు డిమాండ్



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

సీతమ్మధార: జిల్లాలో ఈ–చలానా రద్దు చేయాలని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆటో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆలిండియా ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ వివిధ పద్ధతుల్లో ఈ చలానాలు వేశారని, స్వయం ఉపాధితో బతుకుతున్న ఆటో డ్రైవర్లపై ఈ రకమైన భారం వేయడం అన్యాయమన్నారు. జీవీఎంసీ కమిషనర్ జోక్యం చేసుకుని పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, నో పార్కింగ్ జోన్ పేరుతో ఈ చలానాలు విధించడం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి బి.జగన్, విరాజ్‌కుమార్, సత్యనారాయణ, కె.వి.రమణ, రమేష్, చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

తీరంలో రక్షణ గోడకు మరమ్మతులు



రక్షణ గోడకు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

బీచ్ రోడ్డు: తీరం వెంబడి నిర్మించిన రక్షణ గోడ మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. జీ 20 సదస్సు నేపథ్యంలో కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు ఉన్న రక్షణ గోడను జీవీఎంసీ అధికారులు సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. బీచ్ రోడ్డు డివైడర్ మధ్యలో రకరకాల మొక్కలు నాటి పచ్చదనం పెంపొందిస్తున్నారు. దీంతో తీరం మరింత అందంగా సందర్శకులకు కనిపిస్తోంది.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు కృషి

మద్దిలపాలెం: త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆ పార్టీ 15వ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు కోరారు. వార్డు నాయకులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులైన ఓటర్లను కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సుధాకర్ గురించి వివరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గొలగాని త్రినాథ్, వెంకటలక్ష్మి, పీలా వెంకట్, నరాల సత్తిబాబు, మరియమ్మ, నారాయణరావు పాల్గొన్నారు.

మహా శివరాత్రి వేడుకలకు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి

ఎంవీపీ కాలనీ: సెక్టార్–6లోని శ్రీసిద్ధి వినాయక పార్వతీ ముక్తేశ్వర ఆలయంలో ఈ నెల 18న మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో శ్రీకంచికామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి పాల్గొననున్నారని ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహా శివరాత్రి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

వేతనం తగ్గింపుపై లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు



మాట్లాడుతున్న పెద్దాడ భూలోకరాజు

మహారాణిపేట: తక్కువ వేతనం చెల్లిస్తూ గిరిజనులను ఓ సంస్థ ప్రతినిధులు మోసం చేస్తున్నారని విశాఖ శాంతి బహుజన కార్మిక సంఘం ప్రతినిధి పెద్దాడ భూలోకరాజు ఆరోపించారు. దీనిపై మహారాణిపేటలోని లేబర్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేయగా.. కార్యాలయ అధికారి గోవిందరాజు స్పందిస్తూ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. వైజాగ్ సీపోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి హ్యూమన్ పవర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కార్మికులను సమకూరుస్తుందన్నారు. ఇదే క్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని గిరిజన ప్రాంతాల నుంచి కార్మికులను తీసుకువచ్చారన్నారు. రోజుకు 8 గంటల పనికి రూ.600 వేతనం చెల్లిస్తామని చెప్పి, రూ.400 మాత్రమే చెల్లిస్తామని చెప్పడంతో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. మరోవైపు ప్రస్తుతం గిరిజన కార్మికులకు పని కూడా కల్పించడం లేదని ఆరోపించారు. దీనిపై ప్రశ్నిస్తే శ్రీకాంత్ అనే వ్యక్తి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. సంక్రాంతి పండగకు అయినా గిరిజన కార్మికులకు రావాల్సిన బకాయిలను చెల్లించకపోవడం అన్యాయమన్నారు. అప్పటి నుంచి కూడా అనేక సార్లు సంస్థ ప్రతినిధులతో మాట్లాడినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని, కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

'ఎన్నికల కోడ్ ఉండగా టెండర్లా?'

దాబాగార్డెన్స్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన కోడ్ ఉండగా, టెండర్లు ఎలా పిలుస్తారని జనసేన కార్పొరేటర్లు పీతల మూర్తి యాదవ్, భీశెట్టి వసంతలక్ష్మి ప్రశ్నించారు. జీవీఎంసీ కార్యాలయంలోని జనసేన ఫ్లోర్‌లీడర్ చాంబర్లో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 9 నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, కోట్లాది రూపాయల టెండర్లు ఎలా పిలుస్తారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

బంగారుమెట్టలో ఆకతాయిల హల్‌చల్



శ్రీరామాంధ్ర యువజన సమాజం తలుపు గడియ పగలగొట్టిన వైనం



ధ్వంసం చేసిన సీసీ కెమెరా

- సీసీ కెమెరా ధ్వంసం
- సీసీ ఫుటేజీ తొలగించే యత్నం

అల్లిపురం: ఆకతాయిల చేష్టలతో బంగారుమెట్ట వాసులు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రి సమయాల్లో బంగారుమెట్ట జంక్షన్‌లో నిలిపి ఉన్న ఆటోల్లో మద్యం సేవించి, హంగామా చేస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అంతేగాక, ఆదివారం రాత్రి స్థానిక శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం వద్ద గల సీసీ కెమెరాను వారు ధ్వంసం చేశారు. సీసీ కెమెరా ఫుటేజీలను ధ్వసం చేసేందుకు సర్వర్ ఉన్న గది గడియలను విరగ్గొట్టే ప్రయత్నం చేశారని సమాజం అధ్యక్షుడు భీశెట్టి హనుమంతరావు తెలిపారు. కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి జీవీఎంసీ నిధులతో వార్డులోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని గత నెల 24వ తేదీన టూటౌన్ సీఐ తిరుమలరావు ప్రారంభించారు. ఆ సర్వర్‌ను రామాంధ్ర యువజన సమాజం ఆఫీస్ గదిలో ఏర్పాటు చేశారు. ఆ ఫుటేజీని ధ్వంసం చేసేందుకు ఆదివారం రాత్రి కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించారు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి, టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తు చేస్తున్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం



అధికారులతో సమీక్షిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. ప్రజల నుంచి వాటిని ఆయన స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 02, పబ్లిక్ హెల్త్ విభాగానికి 02, ఇంజినీరింగ్ విభాగానికి 01 చొప్పున అర్జీలు సమర్పించినట్లు జెడ్సీ తెలిపారు. అనంతరం జోనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్పందన అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి, రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్(రెవెన్యూ) పి.బాబూరావు, పబ్లిక్ హెల్త్ శానిటరీ సూపర్‌వైజర్ జనార్దనరావు, ఇంజినీరింగ్ ఈఈ టి.ప్రసన్న, వాటర్ వర్క్స్ డీఈ శ్రీనివాసవర్మ, ఏపీడీ పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా రైతుబజార్



సీతమ్మధార రైతుబజార్‌లో అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

సీతమ్మధార: రైతుబజార్లు ప్లాస్టిక్ రహితంగా మారాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. సీతమ్మధార రైతుబజార్‌లో సోమవారం ప్లాస్టిక్ సంచుల నిషేధం, తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజార్‌లో ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలని, చెత్తను వేరు చేసి డస్ట్ బిన్‌లో వేయాలని సూచించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరాదని, ప్లాస్టిక్‌కు బదులుగా గుడ్డ సంచులు వాడాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది, సచివాలయం సెక్రటరీలు, రైతుబజార్ ఈవో కొండబాబు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న రైల్వే ఉద్యోగుల పిల్లల్లో 2022 పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేసింది. వీఐపీ రోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి విద్యార్థులను అభినందించి, మెరిట్ స్కాలర్‌షిప్స్‌ను అందించారు. పదో తరగతిలో 10కి 10 గ్రేడ్స్ సాధించిన, ఐఐటీ, మెడికల్, ఇంజినీరింగ్ వంటి పోటీ పరీక్షల్లో ర్యాంకర్లు పొందిన సుమారు 125 మంది స్కాలర్‌షిప్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్/చిత్రలేఖనం, వ్యాసరచన, ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో విజేతలైన 21 మందికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఈకార్వో వైస్ ప్రెసిడెంట్‌లు కవితా గుప్తా, మధుస్మిత సాహూ, సెక్రటరీ ప్రియాంక శ్రీదేవి, ట్రెజరర్స్ బిదిషా చటర్జీ, ఇతర ప్రతినిధులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, లీడ్ బ్యాంకు మేనేజర్ శర్మ

మహారాణిపేట: ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన అవసరమని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా చేపడుతున్న ఆర్థిక అక్షరాస్యత వారం–2023(ఫైనాన్షియల్ లిటరసీ వీక్)కు సంబంధించిన పోస్టర్‌ను లీడ్ బ్యాంకు మేనేజర్ వి.ఎస్.శర్మతో కలిసి ఆయన ఆవిష్కరించారు. మన రక్షణకు మంచి ఆర్థిక ప్రవర్తన అనే నినాదంతో వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని శర్మ వివరించారు. ఆర్థిక అక్షరాస్యత వారంలో భాగంగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సీఎఫ్ఎల్, ఎఫ్ఎల్సీ బ్యాంకుల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఓటీపీ, పాస్‌వర్డ్స్, పిన్ లేదా బ్యాంకు ఖాతా వివరాలను ఇతరులతో పంచుకోకూడదని సూచించారు.

టార్గెట్‌బాల్ టోర్నీ విజేతలకు అభినందన



ఉద్యోగులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయిలో మోహన్‌లాల్ సుకాడియా విశ్వవిద్యాలయం(ఉదయ్‌పూర్, రాజస్థాన్) నిర్వహించిన వైస్ చాన్సలర్స్ టోర్నమెంట్ విజేతలుగా ఏయూ ఉద్యోగుల టార్గెట్‌బాల్ జట్టు నిలిచింది. ఈ పోటీలు ప్రతి సంవత్సరం వర్సిటీల బోధనేతర ఉద్యోగులకు నిర్వహిస్తారు. ఈ మేరకు ఇటీవల జరిగిన పోటీలలో ఏయూ ఉద్యోగుల టార్గెట్‌బాల్ జట్టు కప్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఏయూ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఏయూ ఉద్యోగులను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. క్రీడా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, సంచాలకుడు ఆచార్య విజయ్‌మోహన్, ఏయూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.రవికుమార్, కార్యదర్శి పెదిరెడ్ల అప్పలరాజు, వై.రమణ, పెరుమాళ్ల శ్రీను, రమణ, మనోహర్, ఎం.ఎస్.శ్రీను, భాను ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వికేంద్రీకరణతోనే సుపరిపాలన సాధ్యం



మాట్లాడుతున్న ఆచార్య వి.బాలమోహన్‌దాస్

ఏయూ క్యాంపస్: మార్చి నెలలో విశాఖ వేదికగా నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ రాష్ట్రంలో పారిశ్రామిక పురోగాభివృద్ధికి దోహద పడుతుందని మాజీ వీసీ డా వి.బాలమోహన్‌దాస్ అన్నారు. అవర్ స్టేట్ అవర్ లీడర్ డాక్టర్ వైఎస్ఆర్ మేధావుల ఫోరం వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి అధ్యక్షతన ఆంధ్ర విశ్వవిద్యాలయం తత్వశాస్త్ర విభాగంలో 'సుపరిపాలనలో యవత పాత్ర'పై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ పయనిస్తుందని, ఇది పరిపాలన వికేంద్రీకరణతోనే సాధ్యమన్నారు. ఆ దిశగా ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయం స్వాగతించాల్సిన విషయమని చెప్పారు. విశ్రాంత ఆచార్యులు డాక్టర్ తిమ్మారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రజల జీవన ప్రమాణాలు, పెరగడం, ఆనందకర జీవనం సాగించడమే నిజమైన అభివృద్ధి అని, ఆ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. యువత ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకుని ప్రతి స్పందించి సుపరిపాలనలో భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వెంకటరావు, ప్రొఫెసర్ డాక్టర్ పార్వతీశం, విద్యావేత్త ఎస్.అప్పలనారాయణ, ఉపాధ్యాయుడు వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి బడ్జెట్‌లో పెద్దపీట

ఏయూ క్యాంపస్: సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కేంద్ర బడ్జెట్ రూపకల్పన చేశారని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. అర్థశాస్త్ర విభాగంలో కేంద్ర బడ్జెట్‌పై సోమవారం ఉదయం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు బడ్జెట్ కావడంతో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య ఆర్.సుదర్శనరావు మాట్లాడుతూ సప్తరుషి ప్రణాళికలు, లోటు పెరగడంతో అప్పులు చేయాల్సిన అవసరం ఏర్పడుతుందని, ఇది కొంత వ్యతిరేకతకు స్థానం కల్పిస్తున్నారన్నారు. ఆచార్య సి.సాంబమూర్తి మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాల ఫలితంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ఆచార్య కె.శ్రీరామమూర్తి బడ్జెట్ స్వరూపాన్ని విపులీకరించారు. చార్టెడ్ అకౌంటెంట్ వై.సూర్యచంద్రరావు, అర్థశాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.పుల్లారావు తదితరులు బడ్జెట్‌పై ప్రసంగించారు.

టెక్నో ప్రెన్యూర్‌షిప్‌తో ఆత్మనిర్భర్ భారత్ సాకారం



సదస్సులో పాల్గొన్న వక్తలు

ఏయూ క్యాంపస్: టెక్నో ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధితో ఆత్మ నిర్భర్ భారత్ సాకారం అవుతుందని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏయూ డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సదస్సును డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీస్ విశాఖపట్నం కేంద్ర ప్రధాన అధికారి ఆర్.ఎల్.నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ యువతను టెక్నోప్రెన్యూర్ అవకాశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఐపీ ఇన్నోవేషన్, స్టార్టప్ రంగాలలో యువతను మలచాల్సిన ప్రాధాన్యత వివరించారు. దేశంలో ఆవిష్కరణ కేంద్రంగా విశాఖ నగరం నిలుస్తుందన్నారు. శిక్షణ కార్యక్రమం సమన్వయకర్త ఆచార్య హెచ్.పురుషోత్తం మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం అతిపెద్ద ఐపీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వ్యవస్థను నిర్మించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు, ఎస్ఐ–ఎంఎస్ఎంఈ సీనియర్ ఫ్యాకల్టీ జి.సుదర్శన్, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి, డాక్టర్ అనింద్య రాయ్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వం'

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరా ట కమిటీ నాయకులు అన్నారు. మహనీయు ల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 732వ రోజు, సోమవారం ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సీఎంఈ, వీఎస్ జీహెచ్ విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, వరసాల శ్రీనివాసరావు, కారు రమణ, డి.శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర ప్రసంగించారు. ఏళ్లు గడుస్తున్నా, ఉక్కు ఉద్యమాన్ని కొనసాగించడం కార్మికుల పోరాట పటిమకు నిదర్శనమని కొనియాడారు.

లలితా పీఠంలో చండీ హోమం



చండీ హోమం చేస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్‌లోని లలితా పీఠంలో మాఘ మాసం బహుళ అష్టమి సందర్భంగా సోమవారం చండీ హోమం నిర్వహించారు. పండితుల వేద మంత్రాల మధ్య గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి జరిపించారు. లోక కల్యాణార్థం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. హోమం వల్ల ఆరోగ్యం, విజయం సిద్ధిస్తాయన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీ ఉదయం 9 గంటలకు అఘోర గౌరీ మృత్యుంజయ హోమం చేస్తామని, పాల్గొన దలచిన వారు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.